రెచ్చిపోతున్న మట్టి మాఫియా

- నందిగామ నియోజకవర్గంలో రెచ్చిపోతున్న తెలుగు తమ్ముళ్లు ..
- నేరుగా షాడో ఎమ్మెల్యే అనుచరులతో డీల్
- బినామీలుగా తెలుగు తమ్ముళ్లు
- రియల్టర్ల నుంచి రోజు వారీ వసూళ్లు
- చోద్యం చూస్తున్న ఇరిగేషన్, మైనింగ్ శాఖల అధికారులు


అక్రమంగా తరలించిన మట్టితో పరిటాల సమీపంలో ఓ వెంచర్‌ను మెరక చేసిన దృశ్యం


కంచికచర్ల మండలం దొనబండ క్వారీ నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న లారీ

కంచికచర్ల : నందిగామ నియోజకవర్గంలో మట్టి మాఫియా రెచ్చి పోతోంది. నిన్న మొన్నటి వరకు ఇసుక మాఫియా అవతారమెత్తిన కొందరు అధికారపక్ష నాయకులు నేడు మట్టి మాఫియాగా మారారు. చెరువులు, వాగుల్లో మట్టిని యథేచ్ఛగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. షాడో ఎమ్మెల్యేల పేర్లతోనే దందా చేస్తుండటంతో అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

నియోజకవర్గంలో యథేచ్ఛగా మట్టి తోలకాలపై సొంతపార్టీ నేతలే విమర్శలు గుప్పిస్తున్నారు. కొందరు అధికారపార్టీ నేతలే అధికారులకు ఫోన్‌చేసి చెప్పారని సమాచారం. ఎవరైనా అడిగితే షాడో ఎమ్మెల్యేలు చెప్పారంటూ తమ అక్రమ వ్యాపారాలను సాగించేస్తున్నారు.

అబ్బరాజు చెరువు కేంద్రంగా..

కంచికచర్ల మండలం గొట్టుముక్కల సమీపంలోని రిజర్వు ఫారెస్ట్‌ను అనుకుని ఉన్న అబ్బరాజు చెరువు నుంచి గత వారం రోజుల నుంచి యథేచ్ఛగా మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని అధికారపార్టీకి చెందిన ఓ నాయకుడు అధికారులకు, మీడియాకు తెలియజేశారు. మండలంలోని పరిటాల చెరువు నుంచి రాత్రి సమయాల్లో మట్టిని అక్రమంగా తరలించి వెంచర్లకు తరలిస్తున్నారని సమాచారం. అదే మండలంలోని వేములపల్లి- శౌరి అమరవరం గ్రామాల మధ్యన మున్నేరు ఒడ్డు నుంచి అధికారపార్టీ కార్యకర్త ట్రాక్టర్లతో వెంచర్లకు మట్టిని తరలిస్తున్నాడు. అదేమంటే ఎన్నికల సమయంలో తాను లక్షల్లో ఖర్చు చేశానని అంటున్నాడని తెలిసింది. రాష్ట్ర రాజధాని అమరావతికి దగ్గరలోనే కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు వేశారు. ఆ వెంచర్లకు మట్టిని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. చెరువుల్లో నుంచి మట్టిని అక్రమంగా తరలించే వారంతా షాడో ఎమ్మెల్యేకు ముడుపులు ముట్టచెప్పాల్సిందేనని ఆయన అనుచరులు బహిరంగంగా చెప్పుకుంటున్నారు.

రాతి క్వారీల నుంచి..

కంచికచర్ల మండలం పరిటాల శివారు దొడబండ రాతి క్వారీల్లో మైనింగ్‌శాఖ అధికారుల అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. పెద్ద పెద్ద పొక్లెయిన్లతో మట్టిని తవ్వి భారీ లారీలతో వెంచర్లకు తరలిస్తున్నారు. మైనింగ్‌శాఖ అధికారులకు తెలిసినా మిన్నకుండిపోతున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

అన్నీ అధికారులకు తెలిసే..

నియోజకవర్గంలోని మట్టి దందా, ఇసుక దందా విషయం ఇరిగేషన్, మైనింగ్‌శాఖ అధికారులకు తెలిసినా ఏమీ చేయలేకపోతున్నారన్న విమర్శలున్నాయి. కేవలం అధికారపార్టీ నాయకుల భయంతో మిన్నకుండిపోతున్నట్లు అధికారులు చెబుతున్నారు. నందిగామ మండలం కంచల చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలించి ఇటుక బట్టీల కోసం మట్టిని డంప్ చేశారు. అదే రైతులకు మట్టి తోలుకునేందుకు మాత్రం వంద నిబంధనలు పెట్టే అధికారులు ఇటువంటి అక్రమార్కులపై చర్యలు ఎందుకు తీసుకోరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కళాహీనంగా నదులు, చెరువులు..

యథేచ్ఛగా ఇసుక దోపిడీ ద్వారా నదులన్నీ కళాహీనంగా కనిపిస్తున్నాయి. నియోజకవర్గంలో మున్నేరు, వైరా ఉపనది, కట్లేరు, కృష్ణానది ఇసుక దిబ్బలు నీటితో కళకళలాడుతుండేవి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అవీ కళాహీనంగా మారాయి.

కేసులు నమోదు చేస్తాం..

చెరువుల్లో మట్టిని అక్రమంగా తవ్వి తరలిస్తే చర్యలు తీసుకుంటాం. అవసరమైతే కేసు నమోదు చేస్తాం. వెంచర్లు, కమర్షియల్ వ్యాపారులకు ఎక్కడా మట్టి తవ్వకునేందుకు అనుమతులు ఇవ్వలేదు. ఎవరైనా మట్టి తవ్వకాలు చేపట్టినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

–టీ రాజేష్, ఏఈఈ, ఇరిగేషన్, కంచికచర్ల

క్లుప్తంగా

ఘనంగా రామస్వామి రాజా జయంతి



జగ్గయ్యపేటఅర్బన్: ది రామ్‌కో సిమెంట్స్ లిమిటెడ్ వ్యవస్థాపకులు పీఏసీ రామస్వామి రాజా 131వ జయంతి ఉత్సవాలను గురువారం జగ్గయ్యపేటలో ఘనంగా నిర్వహించారు. ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. జయంతి సందర్భంగా రామ్‌కో సిమెంట్స్ యాజమాన్యం ఏర్పాటు చేసిన పలు సేవా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, రామ్‌కో సిమెంట్స్ చైర్మన్ ఆశిష్‌కుమార్ శ్రీవత్సవ, వైస్ చైర్మన్ మహ్మద్‌ఫరూక్, ఏఎస్‌వీఆర్‌కె.మూర్తి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బూడిద నరసింహారావు, జిల్లా ప్రధానకార్యదర్శి చల్లా వైకుంఠరావు, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ నంబూరి రవి, న్యాయవాది శివరాత్రి పృథ్వీరాజ్, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి పింగళి నర్సింహారెడ్డి, పట్టణ యూత్ అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మన్నె అప్పారావు, రామ్‌కో ఉద్యోగులు పాల్గొన్నారు. అదేవిధంగా రామస్వామి రాజా జయంతి ఉత్సవాల్లో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), జనసేనపార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నూకల కుమార్‌రాజా, శ్రీరాం చినబాబు తదితరులు పాల్గొని ఆయనకు నివాళులర్పించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



నందిగామరూరల్: మండలంలోని పల్లగిరి గట్టుపై వేంచేసియున్న అలివేలు మంగ పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. మహోత్సవాలలో భాగంగా గురువారం ఆలయ అర్చకుడు పరాశరం పవన్ కుమార్ స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. విశేష పూజలు, పుష్పార్చన, అభిషేకాలు చేశారు. అనంతరం పలువురు దంపతులు పీటలపై కూర్చుని సామూహిక రమా సహిత సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఆచరించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కొత్తా హనుమేశ్వరరావు, నూరె వెంకటరామారావు, సభ్యులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సత్యమ్మ అమ్మవారికి రూ.11.87 లక్షల ఆదాయం



నందిగామ రూరల్: మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారికి హుండీ కానుకల ద్వారా రూ.11,87,220 ఆదాయం వచ్చినట్లు ఈఓ ఈవో హరిగోపీనాథ్ తెలిపారు. ఆలయ ఆవరణలో గురువారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ 104 రోజులకుగాను రూ.11.87లక్షల ఆదాయం వచ్చినట్లు వివరించారు. హుండీ లెక్కింపులో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పవన్‌కళ్యాణ్, పరిటాల దుర్గాశివసాయి సేవా సమితి సభ్యులు, గ్రామ నాయకులు మంచాల మాధవరావు, కొత్తమాసు రాజా, గోరంట్ల రాము, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వంట ఏజెన్సీలకు బకాయిలు చెల్లించాలని డిమాండ్



కంచికచర్ల: మధ్యాహ్న భోజన పథకం ద్వారా పనిచేసే వంట ఏజెన్సీల నిర్వాహకులకు వేతనాలను పెంచాలని, బకాయిలు తక్షణమే చెల్లించాలని ఐఎఫ్‌టియూ కంచికచర్ల మండల ప్రధానకార్యదర్శి జి.హరికృష్ణారెడ్డి రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. వంట ఏజెన్సీ నిర్వాహకులతో కలిసి గురువారం ఆయన స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఎంఈఓ బాలాజీనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం హరికృష్ణారెడ్డి మాట్లాడుతూ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పనిచేసే వంట ఏజెన్సీ నిర్వాహకులకు ఐదునెలలుగా వేతనాలు అందక వారు ఇబ్బందిపడుతున్నారన్నారు. సంపద సృష్టిస్తామన్న సీఎం చంద్రబాబు వంట ఏజెన్సీ నిర్వాహకులకు సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలగించిన వంట ఏజెన్సీ నిర్వాహకులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల వంట ఏజెన్సీ నిర్వాహకుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జాన్సీరాణి, ప్రభాకుమారి, సభ్యులు వనజాక్షి, షేక్ రంతూన్, వి.రమాదేవి, జి.విజయకుమారి, బీసీడబ్ల్యూసీ మండల అధ్యక్షుడు లక్కిశెట్టి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

నందిగామటౌన్(చందర్లపాడు): చందర్లపాడు మండలం తుర్లపాడు దర్గాలో బడే హజరత్ ఉరుసు ఉత్సవాల సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు బుధవారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన ముస్లింలను కలిసి ఉత్సవాలను సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ బడేహజరత్ ఉరుసు ఉత్సవాలను కుల మతాలకతీతంగా జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఉత్సవాలొంల భాగంగా రాత్రి దర్గాకు చేరుకున్న ముస్లింలకు గ్రామస్తులతోపాటు అన్ని వర్గాల ప్రజలు తమ వంతు సహకారం అందించడం మత సామరస్యానికి నిదర్శనమని కొనియాడారు. కార్యక్రమంలో కంచికచర్ల ఎంపీపీ మలక్ బషీర్, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, నాయకులు ఎంఎఫ్, పారుపల్లి హరిబాబు, పెరమసాని నరసింహారావు, మార్త శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు 'తన్నీరు' పరామర్శ


కార్యకర్తలను పరామర్శిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, గాంధీ, రామారావు తదితరులు

పెనుగంచిప్రోలు: శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తిరునాళ్లలో చోటుచేసుకున్న ఘర్షణ కేసుకు సంబంధించి తాజాగా బెయిల్‌పై విడుదలైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు యర్రంశెట్టి నాగబాబు, కుంచాల సాయిసుధీర్‌లను వైఎస్సార్‌సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జీ తన్నీరు నాగేశ్వరరావు గురువారం వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. ఈసందర్భంగా తన్నీరు మాట్లాడుతూ కేసులోని 16మందిలో ఇప్పటివరకు 14మందికి బెయిల్ వచ్చిందని వివరించారు. బాధిత కుటుంబాలకు పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యకర్తలను పరామర్శించినవారిలో వైఎస్సార్‌సీపీ ఎంపీపీల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మార్కపూడి గాంధీ, రాష్ట్ర బీసీ సెల్ ప్రధానకార్యదర్శి బత్తుల రామారావు, జిల్లా ప్రధానకార్యదర్శి చల్లా వైకుంఠరావు, ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షులు మెండెం రామారావు, మండల పార్టీ మాజీ అధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు, ఆలయ మాజీ డైరెక్టర్ నంబూరి రవి, నాయకులు కాకాని హరి, గుడిమెట్ల శంకర్, గొట్టిపాళ్ల సురేష్ తదితరులు ఉన్నారు.

మే 20న దేశవ్యాప్త సమ్మె : సీఐటీయూ


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి కమల

వత్సవాయి: కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్ ప్రజాసంఘాలు మే 20వతేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను ప్రజలు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ కమల పిలుపునిచ్చారు. వత్సవాయిలో గురువారం సీఐటీయూ మండల కార్యదర్శి జి.నాగేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆమె హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా కమల మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కులను హరించి కార్మికులను యాజమాన్యాల దయాదాక్షిణ్యాలకు వదిలివేసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్‌లను అడ్డుకోకపోతే కార్మికుల భవిష్యత్ అంధకారంగా మారుతుందని పేర్కొన్నారు. లేబర్‌కోడ్‌ల రద్దు చేయాలనే డిమాండ్‌తో మే20 న జరిగే సమ్మెలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి బి.రాము, యూనియన్ సంఘ నాయకులు ఈశ్వరమ్మ, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

కాశ్మీర్ ఉగ్రదాడిని ఖండిస్తూ ర్యాలీ



పేటలో కొవ్వొత్తులతో శాంతిర్యాలీలు నిర్వహిస్తున్న న్యాయవాదులు, ముస్లింలు

జగ్గయ్యపేటఅర్బన్: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద ఉగ్రవాదుల అత్యంత హేయకర క్రూర దాడిలో మరణించిన మృతుల ఆత్మలకు శాంతి కలగాలని కోరుతూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం రాత్రి కొవ్వొత్తులతో శాంతిర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులను ఉక్కుపాదంతో అణచివేయాలని డిమాండ్ చేశారు. శాంతిర్యాలీలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు, న్యాయవాదులు ఆంజనేయులు, డి.నాగేశ్వరరావు, గాంధీ, ప్రదీప్‌రెడ్డి, టీఎల్.నరసింహారావు, శ్రావణ్‌కుమార్, ఫణికుమార్, శ్రీనివాసగౌడ్, మార్కపూడి నాగేశ్వరరావు,నాగరాజు, జె.తిరుపతిరావు,అంకమరాజు, శేషకుమారి, రాజేశ్వర్, దాసరి కృష్ణ, ఉమ, మనోహర్ పాల్గొన్నారు.

మైనార్టీ హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో...

జమ్మూ కాశ్మీర్ పహల్గామ్‌లో జరిగిన ఉన్మాద చర్యను ఖండిస్తూ, ఆత్మీయులను కోల్పోయిన వారికి సంతాపం తెలియజేస్తూ పట్టణంలోని మైనార్టీ హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు కొవ్వొత్తులతో శాంతిర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రవాదుల చర్యలను ఏ మతం కూడా సహించదన్నారు. మైనార్టీ హక్కుల పరిరక్షణ కమిటీ జగ్గయ్యపేట ప్రెసిడెంట్ షేక్ ఇషాక్, వైస్ ప్రెసిడెంట్ సాలేహా, గౌరవ అధ్యక్షుడు మౌలానా ఇబ్రహీం, కమిటీ ప్రతినిధులు రహంతుల్లా, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకం


అంబేద్కర్, గాంధీజీ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ గాంధీ, నాగమణి



మాట్లాడుతున్న నందిగామ వైస్ ఎంపీపీ ఆకుల హనుమంతరావు

పెనుగంచిప్రోలు: దేశాభివృద్ధిలో పంచాయతీ రాజ్ వ్యవస్థ ఎంతో కీలకమైనదని ఎంపీపీ మార్కపూడి గాంధీ పేర్కొన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందినవారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ మౌనం పాటించారు. జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బత్తుల రామారావు, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, కార్యాలయ ఏఓ సిద్ధారెడ్డి, ఈవోపీఆర్‌డీ కె.సుబ్బారావు, ఏపీఎం సుశీల, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, నాయకులు జక్కులూరి దేవదాసు పాల్గొన్నారు.

నందిగామ మండలంలో..

నందిగామరూరల్: గ్రామీణ ప్రాంత ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం ప్రాధాన్యతనివ్వడం లేదని నందిగామ వైస్ ఎంపీపీలు అన్నం పిచ్చయ్య, ఆకుల హనుమంతరావు విమర్శించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లకు పెండింగ్‌లో ఉన్న గౌరవవేతనాన్ని వెంటనే విడుదల చేశాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు తదితర అంశాలపై కార్యదర్శులతో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


చిల్లకల్లులో నివాళులర్పిస్తున్న ఏవో మాధవశర్మ, సిబ్బంది

చిల్లకల్లులో...

చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గాంధీజీ, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు ఏవో వైస్ మాధవశర్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఈఈ శ్రీనివాసరావు, ఏపీవో రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం



షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): మండలంలోని షేర్‌మహ్మద్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. పదోతరగతి పరీక్షల్లో పాఠశాలకు చెందిన సయ్యద్ అజీమాభాను 572 మార్కులు, జుజ్జవరపు రోహిత 537 మార్కులు సాధించారు. ప్రతిభచూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు సత్కరించి అభినందించారు. హెచ్‌ఎం వాణి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో...

కంచికచర్ల : పదోతరగతి పరీక్షల్లో తమ పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభను కనబరిచి అత్యుత్తమ మార్కులు సాధించారని కంచికచర్ల శ్రీఅక్షర ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ కాసరగడ్డ రామారావు గురువారం తెలిపారు. తమ విద్యార్థులు సముద్రాల సాయిచరితశ్రీ 592మార్కులు, కాలవ సాయిచరణ్ కుమార్ 588మార్కులు, ఆర్.వెంకటేష్ 587మార్కులు సాధించారని వివరించారు. విద్యార్థులను స్కూల్ చైర్మన్ గడుపూడి శ్రీధర్, అకడమిక్ డైరెక్టర్ జ్యోతి, ప్రిన్సిపాల్ కె.వందన అభినందించారు.


సముద్రాల సాయిచరితశ్రీ

విద్యార్థులకు అభినందనలు



జగ్గయ్యపేటఅర్బన్: డాక్టర్ బీఎస్ రావు మెమోరియల్ స్పోర్ట్స్ 2024–25 జోనల్ మీట్, ఐఎస్‌టీఎస్‌వో లెవెల్–2తోపాటు నాసా ప్రాజెక్ట్ స్టేట్ లెవెల్–1లో ప్రతిభచూపి బహుమతులు గెలుపొందిన శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులను జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అభినందించారు. ఆయా పోటీల విజేతలు గురువారం ఎమ్మెల్యే తాతయ్యను కలువగా ఆయన అభినందించారు. శ్రీచైతన్య ప్రతినిధులు మురళీకృష్ణ, వినోద్, కృష్ణ, లక్ష్మి, పీఈటీ శ్రీనివాసరావు, జోనల్ ప్రైమరీ ఇన్‌చార్జి ఝాన్సీ, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జి విజయనిర్మల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేపై అవగాహన ర్యాలీ



వీరులపాడు: భూ వివాదాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ రీసర్వేకు రైతులు సహకరించాలని ఆర్డీఓ కె.బాలకృష్ణ కోరారు. మండలంలోని వెల్లంకి గ్రామంలో గురువారం రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా భూములకు సంబంధించిన సరిహద్దు సమస్యలు పరిష్కారం కాకపోవడంతో రైతులు నానాఇబ్బందులు పడుతున్నారన్నారు. రీసర్వేతో భూములకు సంబంధించిన సరిహద్దు సమస్యలు పరిష్కరించేందుకే రీసర్వే చేస్తున్నట్లు వివరించారు. సర్వే సిబ్బందికి సహకరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ హుస్సేన్, డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ సంధ్య, బిక్షం, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

నందిగామ రూరల్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే..నందిగామ మండలంలోని ఐతవరం గ్రామంలోని 65వ నంబరు జాతీయ రహదారిని గ్రామానికి చెందిన గోనెల నాగేశ్వరరావు గురువారం దాటుతున్నాడు. ఈ క్రమంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు అతన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో నాగేశ్వరరావు తీవ్రంగా గాయపడగా, విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన 108 వాహనం ద్వారా అతన్ని నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్య నిమిత్తం విజయవాడ తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంపచెట్లను తొలగించండి సారూ..



గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లిలో పొలాలకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ముళ్ల కంపచెట్లు దట్టంగా పెరగడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దట్టంగా పెరిగిన ముళ్లకంప కొమ్మలు కళ్లకు తగుతున్నాయని రైతులు చెబుతున్నారు. అంత్యక్రియల కోసం ఇదే రోడ్డులో ఉన్న హిందూ, ఎస్సీ శ్మశానవాటికలకు వెళ్లేవారికి ఈ ముళ్లకంప కారణంగా ఇబ్బందులు తప్పడం లేదు. ముళ్లకంప తొలగించాలని ఇప్పటికే పంచాయతీ అధికారులకు చెప్పినప్పటికీ వారు పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి గండేపల్లిలో రోడ్లకు ఇరువైపులా పెరిగి ముళ్ల కంపచెట్లను తొలగించాలని గండేపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.